


**(క్రిందటి వారం నుంచి కొనసాగింపు)**

ఈసారి ఫోన్లో తనకు కర్తవ్య బోధచేశాడు, చిన్నవాడైనా తన కొడుకు !

“నాన్నగారూ, మీ గత చరిత్రంతా నాకు తెలిసిన మాట నిజమే. అల్లాగే ఆత్మీయుల పట్ల మీ బాధ్యతరాహిత్యం కూడ ! అయితే వీటిని ఆసరాగా చేసుకుని మీకు అన్యాయం చేస్తానని, అన్యాయం తలపెడతానని అనుకుని బాధపడి, భయపడకండి. అలాగే అమ్మ చెప్పుడు మాటలు విని మీరు మీ ఆత్మీయులను దూరం చేసుకున్నట్లు నా భార్య చెప్పుడు మాటలు విని మిమ్మల్ని తమ్ముడిని దూరం చేసుకుంటానని అనుకోకండి. అయితే దీనికి ఒక షరతున్నది. దానికి మీరొప్పుకోవాలి, ఆ ప్రకారం చెయ్యాలి. మీ ప్రవర్తనకు మూల కారణం నాకు తెలిసినంతవరకు చెబుతా వినండి. మీరు చదువుకునేటప్పుడు కాని, ఉద్యోగం చేసేటప్పుడు కాని ఒక పేపర్ తప్ప వేరే పుస్తక పఠనం లేదు. మీరు చేసిన తప్పు నేను చేయడం లేదు. సమయం దొరికినప్పడల్లా లిటరేచర్ని చూస్తున్నాను పత్రికల్లోను, లైబ్రరీలలోను. తెలుగు పుస్తకాలు కూడ అమెరికన్ లైబ్రరీల్లో ఉన్నాయి. అలాగే నా స్నేహితులు, ముఖ్యంగా తెలుగు వాళ్ల దగ్గర అనేక కథల పుస్తకాలు, నవలలూ, కవితా సంకలనాలు ఉన్నాయి. అవన్నీ చదివి ఆలోచనా పరిధిని పెంచుకొనే ప్రయత్నం చేస్తున్నాను.  మీరు చేసిన మరో పెద్ద తప్పు, పెద్దల యందు చూపించవలసిన గౌరవం చూపకుండా తప్పచేశారని చెప్పదలుచుకున్నాను.

నా పెళ్లికి ముందు మా ఫ్రెండ్స్ పెళ్లిళ్లు చాలా జరిగేయి. వాళ్ల పెండ్లి శుభలేఖలు నాకు వస్తూండేవి. ఎక్కువ మంది స్వయంగానే, ఇచ్చేవారు శుభలేఖలు. పెండ్లి కుమారుని తాతగారి పేరు మీదే ఉండేవి. కాని తండ్రి పేరు మీద కాదు. పెళ్లి కొడుకు తలిదండ్రుల పేర్లు శుభలేఖ కవరు మీద "ఆహ్వానించువారు" అని వేసేవారు. కాని మీరు నా పెండ్లి శుభలేఖలో తాతగారు, నానమ్మల పేర్లు ఎక్కడా వేయలేదు నా పెళ్లి శుభలేఖ చూడగా ఈ తేడా నాకు తెలిసినా అప్పుడు నేనంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు మీ గత చరిత్రంతా తెలిశాక మీకు మీ తల్లిదండ్రులను గౌరవించకపోవడం మీకు మామూలు విషయమే అని అర్థమయింది. బహుశా ఈ ప్రకారంగా చేయమని అమ్మ ప్రోద్బలం, దానికి సహజంగా మీ వత్తాసు కారణమై ఉంటాయి. ఈ తప్పు కనీసం తమ్ముడి పెళ్లి శుభలేఖలో అయినా సరిదిద్దుకుంటారని ఆశిస్తాను. ఈ సందర్భంలో మీకు మరొక సంగతి గుర్తు చేస్తాను. మా చిన్నాన్న ఒక అపార్ట్మెంటు కొనుక్కుని గృహప్రవేశ ఆహ్వాన పత్రాన్ని తాత గారి పేరు మీదే వేయడం నాకు గుర్తుంది. అదెలాగో నా కంట పడింది. పాపం దాన్ని అమ్మ చింపేసే లోపులోనే ! పెళ్ళి శుభలేఖచూసి మా ఫ్రెండొకడు అడిగాడు మీ తాతగారూ, నాయనమ్మ ఉన్నారా?అని. నేను 'ఉన్నారు' అన్నాను. తాతగారు, నాయనమ్మ లేకపోతేనే ఇలా వేస్తారు అని వాడంటే నేను తలదించుకోవాల్సి వచ్చింది. చిన్నవాడిగా మీకు నీతులు చెబుతున్నాననుకోకండి. తప్పు ఒప్పుకుని సరిదిద్దుకునే ప్రయత్నం చెయ్యడం మానవత్వం. మీరు ఆ దిశలో ప్రయత్నిస్తారా ? మీరూ అమ్మ మీ తల్లితండ్రులు మొదలైన వారి – స్వయంగా తెంపేసుకున్న బంధనాల దారాలను కలిపే ప్రయత్నం చేస్తారా? మీ యిష్టం ! పైన ఒక చోట మీ కన్యాయం చెయ్యనని దానికొక షరతున్నదని చెప్పాను. ఇదే ఆ షరతు, బెటర్ లేట్ దేన్ నెవర్ అని ఒక నానుడి ఉంది. మీరిప్పటివరకు మీ తల్లిదండ్రులతోనూ, తమ్ముళ్ళతోను, చెల్లెలు కుటుంబంతోను రాకపోకలు, పరస్పర సహాయసహకారాలు తెగతెంపులు చేసుకున్నారు. మా ఫ్రెండ్ వినయ్ చెప్పినట్టు మీ తల్లిదండ్రులూ వాళ్ల ఫంక్షన్స్ అన్నింటికి మీ తమ్ముళ్లు, చెల్లెల కుటుంబాలు హజరవుతుంటే మీరే హాజరవ్వక పోవడానికి కారణమేమిటి? తప్పెవరిదంటారు? బాగా ఆలోచించండి! ఆ సంబంధ బాంధవ్యాలను రాకపోకలను పునరుద్ధరించండి. దీనికి అమ్మ అడ్డు పెట్టినా ఆమెకు నయానో భయానో నచ్చచెప్పి ఈ పునరుద్ధరణ కార్యక్రమం వెంటనే ప్రారంభించండి. ఇది నేను చెబుతున్నానని కాదు, న్యాయం, ధర్మం కూడాను. ఎంతో కష్టపడి, అప్పులు చేసి అదీ చిన్న చిన్న జీతభత్యాలతో ఉన్నప్పుడు కూడ – విద్యా బుద్ధులు చెప్పించిన మీ తల్లిదండ్రులకు సుఖసంతోషాలు కల్గించవలసిన కనీస బాధ్యత మీకు లేదా? వాళ్లు మిమ్మల్ని ఆర్థిక సహాయ సహకారాలు అడగటం లేదే ! ఒక వేళ అడిగినా మీ లగ్జరీస్ ప్రక్కన పెట్టి కుటుంబానికి సహాయం చెయ్యాలిసిన బాధ్యత మీపై ఉన్నది. కేవలం మీరు, అమ్మ, మేమూ వాళ్ళిళ్ళలోని ఫంక్షన్స్కి వెళ్లడానికి మీకున్న అడ్డేమిటి?, అసూయ తప్ప! మీరు వెళ్లక పోవడం వలననే వాళ్ళూ రావడం లేదు. నా పెళ్లి అయ్యాక మా మామ గారింటికి వెళ్లాక ఆయన అడిగాడు 'అల్లుడుగారూ మీ పెళ్లికి మీ అమ్మ తరుపు వాళ్లే వచ్చారు, మీ నాన్న గారి తరుపు వాళ్ళెవరూ లేరా?' అని. నేను తలదించుకుని వివరాలు చెప్పేను. అయితే మరి వాళ్ళెవరూ రాలేదేం అని అడిగితే నా నోట మాట రాలేదు ! వాళ్లు రావడానికి నేనూ కొంత ప్రయత్నం చేసి ఉండాలిసిందని, నేనూ నా బాధ్యతని నెరవేర్చలేక పోయానని, ఈసారయినా అటువంటి పొరపాటు జరకుండా చూడాలని నిర్ణయించుకున్నాను. తండ్రిగా నా పథ నిర్దేశకునిగా ముందు మీరు నడవండి. మీ దారిలో నేనూ, నాకుటుంబ సభ్యులం అనుసరిస్తాం. ఇంకొక విషయం నాన్నాగారూ ! అమ్మ తన సహజ కాంప్లెక్సుతో మీరు చెప్పిన వెంటనే మీతో కలిసి రాకపోవచ్చును. అయితే ఆమెకు కౌన్సిలింగ్ చేసీ మీ దారికి తెచ్చుకునే బాధ్యత మీదే!

మీరు చదువులో గొప్ప పట్టుదల గలవారని, ఉద్యోగంలో నిజాయితీ గల వారని నేను విన్నాను. ఎవరికీ అన్యాయం చెయ్యకుండా మీరు మీ సబార్డినేట్స్ని మీ దారికి తెచ్చుకుని అన్ని మేనేజ్మెంట్ టెక్నిక్స్ ఉపయోగించి మీ ఉద్యోగ జీవితంలో నూటికి నూరు పాళ్ళూ సక్సెస్ అయి మంచి ఉన్నతోద్యోగంలో రిటైరయ్యారనీ నాకు తెలుసును. అటువంటి మేనేజ్మెంటు టెక్నిక్స్ మీ కుటుంబంలోనూ ఉపయోగిస్తే, మీ ఆత్మీయులతో సత్సంబంధాలు పునరుద్ధరించు కోవడంలో జయప్రదమవుతారు. ఆ మంచి రోజున నేను మీకు నా ప్రామిస్ నిలబెట్టుకుంటాను. అంతవరకు సెలవు. గుడ్బై" అంటూ వంశీ ముగించాడు.

★★★

వంశీ చెప్పిన విషయాలు, హితబోధ చాలా బావున్నాయి. కాని ఈ చిన్న వెధవ నాకు నీతులు, కర్తవ్య బోధ చేయడమా? అనే దురభిమానం అడ్డువస్తోంది. ఇందిరతో చెబుదాం, ఏమంటుందో ఏం సలహా చెబుతుందో.

తను పడుకోబోయే సరికి " ఏంటండీ, ఈ సారి ఏం చెప్పాడు, మీ సుపుత్రుడు?" అని అడిగింది.

"ముందు మన తప్పులు వప్పుకుని, మా తల్లితండ్రులు, తమ్ముళ్లు, వాళ్ల కుటుంబాలతో సంబంధబాంధవ్యాలు, రాకపోకలు పునరుద్దరించాలట! అప్పుడే మన నిజాయితీ ఋజువవుతుందని, ఆ తర్వాతే మనకు చేస్తున్న అన్యాయాన్ని సరిదిద్దుకుంటానని చెప్పాడు. ఏమంటావు ఇందిరా! ఆ ప్రకారం చేద్దామా..?"

ఇందిర మాట్లాడలేదు. ఆలోచనలో మునిగిపోయింది. అవును, ఈ అనర్థాలకు ప్రధాన కారణం తనే. వాడు చెప్పినట్టు చేస్తే తను తప్పచేసినట్టు ఋజువు అయిపోయినట్లేకదా!

“ఇందిర అటువంటి మనస్తత్వం కలదయితే అసలీ గొడవలే వచ్చేవి కాదు గదా! చూద్దాం” అనుకుని రవి నిద్రకుపక్రమించాడు. కాని నిద్రరావడం లేదు, ఎంత ప్రయత్నించినా. ఇందిరదీ అదే పరిస్థితి అయి ఉంటుంది. కాని నిద్ర నటిస్తూ కళ్లుమూసుకుంది. తప్పంతా ఇందిర మీదే నెట్టేయడం సరియైనది కాదు.

ఈ సందర్భంలో తన కజిన్ విజయ్ గుర్తుకొచ్చాడు. అతడు తనకన్న సంవత్సరం పెద్ద. తండ్రి టీచర్, పల్లెటూర్లో. కాలేజీ చదువుకు అతను అశక్తుడు. ఈ సంగతి తనకు తెలిసి తన తల్లిదండ్రులకు చెప్పి “విజయ్ ను మనం మన దగ్గర ఉంచుకుని సహాయం చేద్దాం నాన్నగారూ!” అంటే వాళ్లు తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా వాళ్లకున్న సహజ ప్రేమాభిమానాలతో, తమకున్న దాంట్లోనే ఇతరులకు సాయం చేద్దామనే సత్సంకల్పంతో విజయ్ని తమ ఇంట్లో పెట్టుకోవడానికి అంగీకరించారు. తానే టెలిగ్రాం ఇచ్చి రప్పించాడు. వాడు తమతో పాటు ఉండి చదువుకున్నాడు. వాడికీ సెంటల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్కు ఉద్యోగం వచ్చింది. అతడు కష్టజీవి, కష్టంలోంచి వచ్చినవాడు. ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం జనరల్ మేనేజర్గా రిటైరయ్యాడు.

విజయ్ తనకు చేసిన ఉపకారాన్ని తన అమ్మనాన్న గార్ల సహకారాన్ని తన జీవితంలో మరచిపోలేదు. వాడికి తాము చేసిన సహాయమల్లా – మాచిన్న ఇంటిలో మాతో పాటు చోటు. ఇంత అన్నం. ఇంతే కాని వాడు నాలా తల్లిదండ్రులను, తమ్ముల్లను, చెల్లెలిని మరచిపోయి, వాళ్లను దూరంగా ఉంచలేదు. తన కుటుంబం ముఖ్యంగా నాన్నగారు జరుపుకునే అన్ని ఫంక్షన్స్కి, మా తమ్ముళ్ల, చెల్లెలు పెళ్లిళ్లు, వాళ్ల పిల్లల పుట్టిన రోజులూ ఒకటేమిటీ అన్ని శుభకార్యాలకూ హాజరవడమే కాదు, వాడే ముందుండి జరిపించే వాడట. కొన్ని నేను చూశాను.

ఇక విజయ్ తన చెల్లెలికి కట్నం ఇచ్చి పెళ్లి చేయడమే కాదు, బావమరిదికి ఉద్యోగం లేకపోవడం వలన, ఒక వ్యాపారానికి పెట్టుబడి పెట్టి అతను జీవితంలో స్థిరపడానికి సహకరించాడట. వాళ్ల పిల్లల్ని తన దగ్గర పెట్టుకుని చదివించాడట. తన తమ్ముడు రామచంద్రానికి స్టేట్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసరు పోస్టింగ్ విజయ్ ఉన్న ఊళ్లోనే రావడంతో వాడిని తన దగ్గరే పెట్టుకుని ఊళ్ళో వ్యాపార వర్గాలకు పరిచయం చేసి వాడు ఉద్యోగంలో స్థిరపడేట్టు చేశాడట.

ఇక విజయ్ తమ్ముడు ఆరోగ్యవంతుడు కాదు. అతనికో కూతురు, కొడుకు. ఆ కూతురు అందగత్తె, ఆమెకో మంచి ధనవంతుల సంబంధం వచ్చింది. నేటి "రేట్ల" ప్రకారం ఆ వరుడికి 50 లక్షల కట్నం ఇవ్వవచ్చు. కాని మధ్యవర్తుల సహకారం, అమ్మాయి అందం చూసి వరుడు కేవలం 5 లక్షల కట్నానికి అంగీకరించి పెళ్లి చేసుకోవడానికి ముందుకొచ్చేడట. పిల్ల తండ్రి అయిదు లక్షలు కాదు కదా, 50వేలూ ఇచ్చే స్థితిలో లేడు. అందువలన విజయ్ తన భార్యకు తెలియకుండా ఈ అయిదు లక్షలూ తానే ఇచ్చి పెళ్లి దగ్గరుండి జరిపించాడట. గొప్ప ధనవంతుడైన అన్నయ్య తన కష్టార్జితం నుండి 5లక్షలు తమ్ముడి కూతురి పెళ్లికిస్తాడా? తనలాగ మరీ చిన్న గిఫ్ట్ తో సరిపెట్టక పోయినా, ఏ వెయ్యినూటపదహార్లో ఇచ్చి సరిపెట్టడూ?

ఇంతకీ తనకు తెలిసిన సంగతేమిటి అంటే విజయ్ భార్య ఇందిర లాంటిదే. తన పుట్టింటి వాళ్ల మంచి చెడ్డలే కాని భర్త వాళ్ల సంబంధ బాంధవ్యాలు కావాలనుకునేది కాదు. కాని తేడా అల్లా విజయ్కు తనకూ ఉన్నది– తాను భార్య చెప్పుడు మాటలు విని, నమ్మి తన వాళ్లను దూరం చేసినట్టుకాకుండా విజయ్ తన విశిష్ట వ్యక్తిత్వంతోనూ, మానవత్వంతోను తన బాధ్యతలను నెరవేర్చాడు. తాను 100% ఈ విషయంలో ఓటమి పాలయ్యాడు.

ఈ సందర్భంలోనే తన చెల్లెలికి తాను చేసిన అవమానం గుర్తుకు వచ్చింది. ఆమెకూ తనకు వయస్సులో రెండేళ్లే తేడా. అందువలన ఇద్దరూ కలిసే పెరిగారు, కలిసే ఒకే కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమె తెలివితేటలు, పట్టుదల వలన పెళ్లయిన వెంటనే స్టేట్ బ్యాంకులోనే అసిస్టెంటుగా పోస్టింగ్ వచ్చింది. భర్త సెంట్రల్ అండర్ టేకింగ్లో ఇంజనీర్. తన భార్య ఇందిర కేవలం హౌస్ వైఫ్. తన చెల్లెలు ఆర్థిక పరిస్థితితో పోలిస్తే తమది తక్కువ స్థాయి. బహుశా అదే కారణం వలన కావచ్చును. ఇందిరకూ తనకూ కూడ చెల్లెలు కుటుంబం అంటే అసూయ! కాని తన చెల్లెలు జ్యోతికిటువంటి వేం లేవు. తను వాళ్లింటికి వెళ్లకపోయినా తనే పిల్లలు, భర్తతో కలిసి దూరమయినా బెంగుళూరు వచ్చి తమ పిల్లలతో చక్కగా గడిపి వెళ్లేది. మరో విచిత్రం. తన ఇంటికి తోడబుట్టింది, పిల్లలతో వస్తే తనే వాళ్లందరికీ బట్టలు పెట్టాలి. కాని తన విశిష్ట వ్యక్తిత్వంతో జ్యోతే తనకూ భార్యకూ, పిల్లలకూ బట్టలు పెట్టి పిల్లలకు గిఫ్ట్లు ఇచ్చి వెళ్లింది. ఇదంతా తమ మధ్య దూరం ఉండకూడదని కలుపుకుపోవాలని ఆమె ఉద్దేశం. కాని జ్యోతి అంచనాలను తలక్రిందులు చేసూ, వాళ్లు తిరగి వెళ్లిన వెంటనే వాళ్ల మీద ఇందిర తనకు లేనిపోని చాడీలు చెప్పి తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న దూరాన్ని యథాతథం చేసింది. పై పెచ్చు జ్యోతి కుటుంబ సభ్యులమీద లేని పోని అభాండాలు వేస్తూ ఒక పెద్ద ఉత్తరం రాసింది. ఇందిర ధ్యేయం ఒక్కటే! ఎప్పుడైనా తను గాని తమ పిల్లలుగాని తన తల్లితండ్రుల, అన్నదమ్ముల, చెల్లెలతో కలిసి ఉండే పరిస్థితి రాకుండా సర్వశక్తులూ వడ్డి మరీ కృషిచేసి జయప్రదం అయింది. ఇదేంత అన్యాయం ! ఇదంతా తనకు తెలిసినా తనూ ఆమెతో కలిసి తన వాళ్లను దూరం చేసుకుంటున్నాడు...! ఇంతే కాదు. ఇందిరతో కలిసి తను తన చెల్లెలు కుటుంబాన్ని మరోరకంగా అవమానించాడు. చెల్లెలు కూతురు పెళ్లి శుభలేఖ తన ఇంటి అడ్రస్సుకే వచ్చింది. కాని ఇందిర ఎప్పటిలాగానే దానిని చింపేసి తనకు తెలియకుండా చేసింది. ఈ సంగతి తనకు తమకుమారుడి పెళ్లి శుభలేఖ నాన్నగారింటికి తీసుకుని వెళ్లినప్పుడు తెలిసింది. ఆయన దగ్గర అందరి అడ్రసులూ ఉంటాయి. ఆయనే చెల్లెలు కూతురు పెళ్లి శుభలేఖ మీద తన అడ్రస్సు స్వయంగా రాసి దాన్ని తనే స్వయంగా పోస్టుచేసారట. తమకు చెల్లెలు కూతురు పెళ్లి శుభలేఖ పంపలేదని నాన్నగారి దగ్గర దబాయించడం, ఆ ప్రకారంగా తామూ తన కుమారుని పెండ్లి శుభలేఖ చెల్లెలికి పంపకపోవడం జరిగింది. ఈ పాపాలన్నీ తననిప్పుడు తట్టి కుదుపుతున్నాయి.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments